# సంస్కృతి

-కె.వి.సీత

"చూడండి పంతులుగారూ! మావాళ్లకంతా శాస్త్ర ప్రకారం జరగాలి. కొంచెం టైమ్ పట్టినా ఫర్వాలేదు. అన్ని తంతులు పూర్తిగా జరిపించండి" సిల్కులాల్చీ వేసుకున్న ఓ నడివయస్సు ఆయన అంటున్నాడు. ఆయన అబ్బాయి తరఫు బంధువు. పెళ్లిమండపం అంతా కోలాహలంగా ఉంది. పట్టుచీరల రెపరెపలు, గాజుల గలగలలూ, సన్నాయి వాద్యం, బాజాభజంత్రీలు, బంధుమిత్రుల పలకరింపులూ...అన్నీ కలిసి ఒకటే సందడి. నీలంరంగు పట్టుచీర కట్టుకున్నావిడ చాలా హడావుడిగా తిరుగుతోంది ఎక్కడ చూసినా ఆవిడే అన్నట్లు. ఆమె ఆడ పెళ్లివారి దగ్గర బంధువు.

"అమ్మా! వధూవరుల మధుపర్కాలు, తాళిబొట్టు, తలంబ్రాలు అన్నీ సిద్ధం చేసి పెట్టండి. మరోగంటలో పీటలమీద కూర్చోవాలి. ఈలోగా మంగళస్నానాలు అవీ కానివ్వాలి మరి" తొందరపెడుతున్నారు పంతులుగారు.

"చూడండి పంతులుగారూ! మావాళ్లకంతా శాస్త్ర ప్రకారం జరగాలి. కొంచెం టైమ్ పట్టినా ఫర్వాలేదు. అన్ని తంతులు పూర్తిగా జరిపించండి" సిల్కులాల్చీ వేసుకున్న ఓ నడివయస్సు ఆయన అంటున్నాడు. ఆయన అబ్బాయి తరఫు బంధువు.

"అబ్బాయి... తాలూకావాళ్లు అమెరికాలో ఉన్నా ఎంత పద్ధతిగా ఉన్నారో? సంప్రదాయం అంటే ఎంత గౌరవం?" అన్నారు బంధువులు.

"మరే... ఎంత చదివినా ఏ దేశంలో వున్నా మన సంస్కృతీ సంప్రదాయం మరచిపోకూడదు" నీలంరంగు పట్టుచీరావిడ తలలో పూలు సర్దుకుంటూ అంది.

రెండు వీడియో కెమెరాలు మొత్తం హాలంతా కవర్ చేస్తున్నాయి. సడెన్‌గా వినిపించింది శబ్దం చెవులు దద్దరిల్లేలా. ఏదో కొత్త సినిమా పాట స్టీరియోలో ప్లే చేస్తున్నారు. నాలుగు పక్కలా ఉన్న స్పీకర్ల నుంచి చెవులు అదిరేలా విన్పించింది. అందరూ తలలు తిప్పారు. నలుగురు కుర్రాళ్లు స్టెప్స్ వేయడం మొదలెట్టారు. అది చూసి ఇద్దరమ్మాయిలు కూడా ముందుకొచ్చారు. పదిమంది చుట్టూ చేరారు గుంపులా.

"అరె.. మంచి పాట. డాన్స్ కూడా చేస్తున్నట్టున్నారు" నీలం చీరావిడ గబగబా లేచింది.

"ఎంత బాగా చేస్తున్నారో" ఆవిడ కూడా గుంపులో చేరింది.

"ముహూర్తానికి ఇంకా చాలా టైముందిగా. మనం కూడా వెళదాం" మరో నలుగురు లేచారు. కొత్త కొత్త హుషారైన పాటలు వేస్తున్నారు ఒకదాని వెనుక ఒకటి. ఒక్కొక్కరే చేరుతున్నారు. గుంపు పెరుగుతున్నకొద్దీ కుర్రాళ్లకి హుషారు ఎక్కువైంది. నీలం చీరావిడ డాన్స్ చేస్తున్న వాళ్లని ఉత్సాహపరుస్తోంది.

"కాస్త సౌండ్ తగ్గించండి" పంతులుగారి మాటలు గాల్లో కలసిపోయాయి. సన్నాయి వాద్యం స్టీరియో సౌండ్‌లో మిళితమైపోతోంది.

"ఇవతల పెళ్లి జరుగుతుంటే ఆ స్టీరియోగోలేమిట్రా?" పసుపురంగు చీరకట్టుకున్న పండు ముత్తయిదువ అరుస్తోంది.

"పోనీలే అత్తయ్యా! పిల్లలుకదా, వాళ్ల సరదా వాళ్లది" వెనకేసుకొచ్చాడు సిల్కులాల్చీ ఆయన. ఆయన దృష్టంతా గుంపువేపే ఉంది. పోనీ ఆటు వెళదామంటే పెద్దరికం అడ్డొచ్చింది. తప్పనిసరై మంటపానికి దగ్గరగా కూర్చున్నాడు.

వీడియో కెమెరా ఒకటి గుంపువైపు తిరిగింది.

"ఆంటీ మీరు కూడా చేయండి" ఒకమ్మాయి నీలంరంగు చీరావిడ చెయ్యి పట్టుకుని లాగింది ఆవిడ హుషారు చూసి.

కెమెరా అటువైపు ఫోకస్ అయింది. అంతే ఆవిడలో ఉత్సాహం పొంగుకొచ్చింది. ఆవిడ కూడా స్టెప్స్ వేయడం మొదలెట్టింది.

"ఆ వీడియో అబ్బాయి సిటీ ఛానెల్‌లో పని చేస్తాడట" ఎవరో అన్నారు.

"అంటే రేపు టీవీలో ఇదంతా వస్తుందా?"

"టీవీలో వస్తుందిట. మీరు కూడా చేయండర్రా" పిల్లల్ని తరుముతూ తల్లులు కూడా చేరిపోయారు.అంతవరకూ మొహమాటంగా అటూ ఇటుగా కూర్చున్న సిల్కులాల్చీ ఆయన కూడా పరుగెత్తుకొచ్చేసాడు. ఆయన కూడా కెమెరా దృష్టిలో పడడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు. గుంపు అంతకంతకూ పెరిగిపోతోంది.

"అదేమిట్రా అబ్బాయ్ అక్కడ? ఏదో మేజువాణీలాగుంది?" ఒక ముసలాయన కళ్లజోడు సవరించుకుంటూ అన్నాడు గుంపుకేసి చూస్తూ.

"అలాంటివే బాబాయ్. ఎటొచ్చీ పెళ్లివారికేం ఖర్చులేదు. అంతా ఫ్రీ ఎంటర్‌టైన్‌మెంట్"

ఒకమ్మాయి అందరికీ అక్షింతలు ఇస్తోంది.

ముహూర్తం సమీపిస్తోంది. బాజా భజంత్రీల శబ్దం స్టీరియో శబ్దంలో కొట్టుకుపోతోంది. గుంపులో కొంతమంది వధూవరులపైన అక్షింతలు జల్లి గబగబా తరుముకొస్తున్నట్లు వచ్చేస్తున్నారు ఏం మిస్ అయిపోతామేమోనని. మరికొంతమంది మండపందాకా పోకుండా దూరం నుండే జల్లేసి అక్షింతలు బరువు దింపుకున్నారు. డాన్స్ తారాస్థాయికి చేరుకుంది. నీలంరంగు చీరావిడ వొళ్లంతా వూపుతూ మెలికలు తిరుగుతూ అభినయిస్తోంది. ఒకటే చప్పట్లు.

"ఆంటీ... అదరగొట్టేస్తున్నారు. అచ్చం సినిమాలలోలాగేనే చేస్తున్నారు" అన్నారు పిల్లలు.

"మీ అడ్రస్ ఇవ్వండి ఆంటీ" వీడియో అబ్బాయి అంటున్నాడు. "మా ఛానెల్ వాళ్లు త్వరలో 'డాన్స్ ఆంటీ డాన్స్' ప్రోగ్రామ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. మీరు సెలెక్ట్ కావడం గ్యారంటీ" ఆవిడ ముఖం వెలిగిపోయింది.

"అబ్బా.. ఎంత అదృష్టం. టీవీ ప్రోగ్రామ్‌కి సెలెక్ట్ కావడం" ఆవిడ అప్పుడే సెలెక్ట్ అయినట్లు అభినందించారు నలుగైదుగురు.

ఓ గళ్లచొక్కా ఆయన కొడుకును రెక్కపుచ్చుకుని లాక్కువస్తున్నాడు తిడుతూ.

"వెధవా... రిలీజైన ప్రతి సినిమా చూస్తావు, డాన్స్ చేయలేవా? టీవీలో వచ్చేవాడివికదా"

"నాకు డాన్స్ చేయడం రాదు నాన్నా. ఆడుకుంటాను వదులు'' గింజుకుంటున్నాడు.

"బుద్ధి జ్ఞానం లేకపోతే సరి'' పెళ్లి కూతురు కోపంగా అరిచింది. "వీళ్లసలు పెళ్లి చూడడానికి వచ్చారా డాన్స్ చూడడానికి వచ్చారా? పిల్లలకేదో తెలియకపోవచ్చు. పెద్దవాళ్లు కూడా ఆ తైతెక్కలేమిటి?''

"ష్... నెమ్మదిగా మాట్లాడు పిన్నీ... అక్కడ అబ్బాయి తరపువాళ్లు కూడా ఉన్నారు. వింటే బాగోదు.'' మాంగల్యధారణ జరిగిపోయింది.

"అంతా భోజనానికి పదండి'' పిలిచారెవరో.

బిలబిలా కదిలింది గుంపు. పట్టుమని పది మంది మిగిలారు పందిట్లో. మిగిలిన పెళ్లి తంతు జరుగుతోంది. భోజనాలయ్యాక వెళ్లేవాళ్లు వెళ్లి పోతున్నారు. లోకల్ వీడియో అబ్బాయి కూడా వెళ్లిపోయాడు.

స్టీరియో అబ్బాయి అన్నీ సర్దేసుకుంటున్నాడు. హాలంతా సద్దుమణిగింది. భోజనాలయ్యాక తిరిగొచ్చి హాల్లో కూర్చున్నారు.

దగ్గర బంధువులంతా.తుఫానొచ్చి వెలిసినట్లుగా ప్రశాంతంగా ఉంది హాలంతా.వాతావరణం అంతా మళ్లీ యధాతధంగా మంగళవాయిద్యాలు, బాజాభజంత్రీలు, పంతులుగారి మంత్రాలు...అన్నీ విన్పిస్తున్నాయి స్పష్టంగా.

"ఇదిగో భజంత్రీలు చక్కగా ఒక త్యాగరాజుకీర్తన వాయించండి. ఎంతసేపూ ఆ సినిమా ట్యూన్‌లేనా?'' పెద్దాయన ఎవరో అంటున్నారు.

"మరే... మన సంస్కృత సంప్రదాయం ఎప్పుడూ మరచిపోకూడదు'' నీలంరంగు చీర విడ పక్కనున్న వాళ్లతో అంటోంది.

"అవునవును'' తలలూపారందరూ.

★

